సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం । 19 । ఆగస్టు । 2024



ఆలయానికి రూ.50 వేల విరాళం

గోకవరం: వెదురుపాక ఆంజనేయస్వామి కైంకర్యాలకు తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రామకృష్ణమూర్తి, రంగనాథస్వామి (కోరుకొండ) రూ.50,220 అందించారు.



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవనానికి గంధం రామారావు, సూర్య వెంకట లక్ష్మి దంపతులు (రావులపాలెం) రూ.1,01,116 విరాళం అందించారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 2,47,601 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 13,400 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

ఎస్సైల నియామకం

కంబాలచెరువు: జిల్లాలో నూతనంగా నలుగురు ఎస్సైలను నియమిస్తూ పోలీసుశాఖ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజమహేంద్రవరం త్రీటౌన్ ఎస్సైగా ఇప్పటివరకు కొవ్వూరు ఎస్సైగా పనిచేసిన జుబైర్ మహ్మద్ నియమితులయ్యారు. ప్రకాశ్‌నగర్ ఎస్సైగా సోమన శివప్రసాద్ నియామకమయ్యారు. ఆయన ఇప్పటివరకు జిల్లా డీఎస్‌బీలో పనిచేశారు. సీతానగరం ఎస్సైగా జిల్లా డీఎస్‌బీలో పనిచేసిన ఏ.ఫణిమోహన్, నల్లజర్ల ఎస్సైగా ఇప్పటివరకు వీఆర్‌లో ఉంచిన జి.శ్రీహరిబాబును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఒకటో పట్టణ ఎస్సైగా పనిచేసిన ఎం డీఅష్పక్‌ను వీఆర్‌లో ఉంచారు.

కోటసత్తెమ్మ ఆలయం కిటకిట



ప్రత్యేక పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ అమ్మవారు

నిడదవోలు రూరల్: శ్రావణ మాసం పురస్కరించుకుని నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు అప్పారావు శర్మ ఆధ్వర్యంలో కోటసత్తెమ్మ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టికెట్లు, ఫొటోల అమ్మకంతో రూ.1,20,788 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ఆలయ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గాయత్రి మాతగా వనదుర్గమ్మ



అన్నవరం: రత్నగిరి దుర్గామాత శ్రీ వనదుర్గ అమ్మవారి శ్రావణమాస జాతర మహోత్సవాలలో భాగంగా నాలుగో రోజు ఆదివారం వనదుర్గ అమ్మవారిని గాయత్రి మాతగా అలంకరించి పండితులు పూజించారు. ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు రుత్విక్కులు నవగ్రహ జపాలు, శ్రీచక్రార్చన, పురుష, శ్రీ సూక్త పారాయణ, మూలమంత్ర జపాలు, సూర్యనమస్కారాలు, సప్తశతీ పారాయణలు, మూలమంత్ర జపాలు, బాల, కన్య, సువాసినీ పూజలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు లక్ష కుంకుమార్చన, చండీహోమం నిర్వహించారు. కుంకుమార్చన అనంతరం సాయంత్రం ఆరు గంటలకు అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, ప్రసాదాలు నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. వేద పండితులు గొల్లపల్లి ఘనాపాఠి. యనమండ్ర శర్మ, ఉపాధ్యాయుల రమేష్, ముష్టి పురుషోత్తం, కల్యాణబ్రహ్మ ఛామర్తి కన్నబాబు, ప్రథమశ్రేణి వ్రత పురోహితులు నాగాభట్ల రవిశర్మ, పాలంకి పట్టాభి, అంగర సతీష్, ఆలయ అర్చకులు కోట వంశీ, పరిచారకులు పవన్ ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

పొగాకు సాగుకు శ్రీకారం

- మెట్ట ప్రాంతంలో ముమ్మరంగా కడుతున్న నారుమడులు
- అధిక దిగుబడులనిచ్చే వంగడాల సాగు
- పెరిగిన కౌలు ధర.. అయినా తగ్గని డిమాండ్

దేవరపల్లి మండలం పల్లంట్లలో కట్టిన పొగాకు నారుమడులు



దేవరపల్లి: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతంలో పొగాకు సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. ఒకపక్క పొగాకు అమ్మకాలు జరుగుతుండగా మరోపక్క నారుమడులు కడుతున్నారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి సీజన్ ప్రారంభమైంది. పంట ఉత్పత్తికి సంబంధించి పొగాకు బోర్డు కోటాను ఖరారు చేయడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. సాగుకు అవసరమైన పొగాకు నారుమడులు రైతులు సిద్ధం చేస్తున్నారు. అధిక దిగుబడులు ఇచ్చే వంగడాలను సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఎక్కువగా ఐటీసీ సంస్థ సరఫరా చేస్తున్న ఎల్‌వీ-7, 1350, 1353, 1383 వంగడాలతో రైతులు నారుమడులు వేస్తున్నారు. ఈ వంగడాలు ఎకరాకు సగటున 12 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి వస్తున్నాయి. మెట్ట ప్రాంతంలో పొగాకు నారుమడులను ముమ్మరంగా కడుతున్నారు. నారుమడులు కట్టడానికి వాతావరణం అనుకూలంగా ఉండడంతో దుక్కులు సిద్ధం చేసి విత్తనాలు వేస్తున్నారు. దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం వేలం కేంద్రాల పరిధిలో సుమారు 70 వేల ఎకరాల్లో పొగాకు సాగు జరుగుతోంది. రెండు సంవత్సరాలుగా పొగాకు ధరలు ఆశాజనకంగా ఉండడంతో సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

కౌలు రైతులే ఎక్కువ

పొగాకు నారుమడులు కట్టే రైతుల్లో ఎక్కువ మంది కౌలుదారులు ఉన్నారు. ఐదు వేలం కేంద్రాల పరిధిలో దాదాపు వేయిమంది కౌలు రైతులు నారుమడులు కట్టి వ్యాపారం చేస్తున్నారు. ఒక్కొక్క రైతు ఎకరం నుంచి ఐదు ఎకరాల్లో నారుమడులు వేస్తున్నారు. 2021–22 సంవత్సరంలో ఎకరం నారు రూ. 5 వేలు పలుకగా, 2022 సీజన్‌లో ఎకరం నారు(6 వేల మొక్కలు) రూ.18 వేలు పలికింది. 2023–24 సీజన్‌లో ఎకరం నారు రూ.18 వేలు పలకడంతో రైతులకు కాసుల పంట పండింది. ఎకరం విస్తీర్ణంలో నారు మడులు కట్టిన రైతులు సుమారు రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల ఆదాయం పొందారు. గత ఏడాది డిసెంబర్‌లో మిఛాంగ్ తుపాను కారణంగా పొగాకు తోటలు దెబ్బతినడంతో మళ్లీ నాట్లు వేయడానికి రైతులకు నారు కొరత ఏర్పడింది. దీంతో నారు ధర రికార్డు స్థాయికి చేరుకుని రూ.18 వేలు పలికింది. ఈ ధర దాదాపు నెల రోజులు ఉండడంతో నారుమడులు కట్టిన రైతులకు ఊహించని లాభాలు వచ్చాయి.

పెరగనున్న సాగు విస్తీర్ణం

ఈ ఏడాది పొగాకు ధరలు క్వింటాలు గరిష్ఠంగా రూ.400 పలకడంతో 2024–25 పంట కాలానికి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉన్నందున నారుమడుల విస్తీర్ణం కూడా పెరుగుతుందని రైతు సంఘాల ప్రతినిధులు అంచనా వేస్తున్నారు. ఎకరం కౌలు గత ఏడాది రూ.45 వేలు ఉండగా, ఈ ఏడాది రూ.75 వేలు పలుకుతోంది. పొగాకు సాగుకు ఎకరం కౌలు ధర రూ.70 వేల నుంచి రూ.75 వేలు పలుకుతుండగా, నారుమడులకు రూ.1 లక్ష వరకు పలుకుతుందని రైతులు తెలిపారు. ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు నారుమడుల భూములు కౌలుకు ఇస్తున్నారు. అయినా భూమి దొరకడం కష్టంగా ఉందని కౌలు రైతులు అంటున్నారు. దేవరపల్లి, గోపాలపురం వేలం కేంద్రాల పరిధిలో పల్లంట్ల, బందపురం, లక్ష్మీపురం, యర్నగూడెం, సంగాయగూడెం, చిన్నాయగూడెం, గోపాలపురం మండలంలో గోపాలపురం, చిట్యాల, వేళ్లచింతలగూడెం, చిట్యాల గ్రామాల్లో పొగాకు నారుమడులు ముమ్మరంగా వేస్తున్నారు. అధిక దిగుబడులు వచ్చే నూతన వంగడాల గురించి రైతులు ఎదురు చూస్తున్నారు. పొగాకు బోర్డు, సీటీఆర్‌ఐ. ఐటీసీ సంస్థల వంగడాలను రైతులకు సరఫరా చేస్తున్నారు.

ట్రే నర్సరీల ఏర్పాటు

ట్రే నర్సరీలను ఎక్కువగా ఏర్పాటు చేస్తున్నారు. పొలాల్లో షేడ్ నెట్ వేసి నారు పెంచుతున్నారు. ట్రే నారు నాణ్యంగా ఉండి, చీడపీడలను తట్టుకుంటుందని రైతులు తెలిపారు. నారు రేటు ఎక్కువగా ఉన్నప్పటికి రైతులు ట్రే నారు నాటుతున్నారు. పెద్ద రైతులు సొంతంగా ట్రే నారు పెంచి తోటలు వేస్తున్నారు. దేవరపల్లి మండలం పల్లంట్ల, బందపురం, లక్ష్మీపురం, గ్రామాల్లో సుమారు 150 ఎకరాల్లో నారుమడులు వేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు వేసిన నారుతో అక్టోబర్ నుంచి నాట్లు వేయడం ప్రారంభిస్తారు. పలు గ్రామాల్లో రైతులు షేడ్‌నెట్‌లు ఏర్పాటు చేసి ట్రేలు ఏర్పాటు చేసి నారు పెంచుతున్నారు.

వంగడాల సరఫరా



అధిక దిగుబడులు వచ్చే కొత్త వంగడాలను ఐటీసీ సరఫరా చేస్తోంది. ఎల్‌వీ-7 వంగడం విత్తనం కిలో రూ.15 వేలు, 1353, 1350 వంగడాల విత్తనాలు రూ.20వేలు. వాతావరణం అనుకూలించి, సారవంతమైన భూములైతే ఈ వంగడాల వల్ల ఎకరాకు 12 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. చీడపీడలను తట్టుకుంటున్నాయి. ట్రే నర్సరీలు ఎక్కువగా వేస్తున్నారు. ప్రస్తుతం నారుమడులు మొలక దశలో ఉన్నాయి.

– కరుటూరి శ్రీనివాసరావు, రైతు, సంగాయగూడెం, దేవరపల్లి మండలం

కౌలుదారుల్లో పోటీ



కౌలుదారులు పోటీపడి భూములను కౌలుకు తీసుకుంటున్నారు. గత ఏడాది మీ చాంగ్ తుపానుకు ముందు ఎకరం నారు రూ.3,500 ఉంది. అనంతరం రూ.18 వేలు పలికింది. పొగాకు ధర కూడా కిలో రూ.400 పలకడంతో భూముల కౌలు ధర పెంచారు. నేను 15 సంవత్సరాల నుంచి నారుమడులు కట్టి నారు అమ్మకాలు చేస్తున్నాను. ఎకరం కౌలు రూ.20 ఉన్నప్పుడు నారుమడులు కట్టడం మొదలెట్టాను. కిలో విత్తనాలు రూ.20 వేలకు కొనుగోలు చేస్తున్నాం.

– కడిమి శ్రీనివాస్, కౌలు రైతు, దేవరపల్లి

ది జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నిక ఏకగ్రీవం



ఏకగ్రీవంగా గెలిచిన డైరెక్టర్లతో ఎన్నికల అధికారి జగన్నాథరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: ది జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ పాలకమండలి ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని ఎన్నికల అధికారి ఎం.జగన్నాథరెడ్డి ఆదివారం ప్రకటించారు. ఈ నెల 25వ తేదీన జరగాల్సిన ఎన్నికలకు 37 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా నలుగురి దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం నియోజకవర్గం–1లో 21 మంది అభ్యర్థులు, నియోజకవర్గం–2లో ఇద్దరు అభ్యర్థులు, నియోజకవర్గం –3లో ముగ్గురు అభ్యర్థుల దరఖాస్తులను ఆమోదించగా ఆదివారం పలువురు తమ నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో ఎన్నిక ఏకగ్రీవమైందన్నారు. రాష్ట్రంలో 10 బ్రాంచీలలో 27,724 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. కాగా ఎన్నికల్లో అభ్యర్థులు తమ దరఖాస్తులను ఉపసంహరించుకోవడంతో ఆర్ (రొబ్బి)విజయశేఖర్, ఎం.లక్ష్మణరావు, గుంటుముక్కల సత్యనారాయణ ప్రసాదరావు, జామిశెట్టి గాంధీ, ద్వారా పార్వతి సుందరి, నాగేశ్వరరావు కనకం, ప్రసాదుల హరనాథ్, బీరా శ్రీనివాసరావు, బూరా రామచంద్రరావు, బొమ్మన జయ కుమార్, యాండ్రపు రామకృష్ణ, జామి కృష్ణ బ్యాంక్ డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు జగన్నాథరెడ్డి ప్రకటించారు. డైరెక్టర్ల ఎన్నిక పూర్తి కావడంతో సోమవారం చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక జరగనున్నదన్నారు.

సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,001

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి రాయుడు శ్రీనివాసరావు (కాకినాడ) రూ.1,00,001 విరాళాన్ని ఆది వారం సమర్పించారు. దాతకు అన్నదానం రశీదు, బాండ్‌ను అధికారులు అందజేశారు.

సత్యదేవుని ఆలయానికి భక్తుల తాకిడి

- స్వామిని దర్శించిన 40 వేల మంది
- దేవస్థానం ఆదాయం రూ.40 లక్షలు



సత్యదేవుని రథోత్సవం దృశ్యం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆదివారం వేలాదిగా వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. సత్యదేవుని సన్నిధిన శనివారం రాత్రి పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. వివాహాలు చేసుకున్న నవ దంపతులు, ఇతర ప్రాంతాలలో వివాహాలు చేసుకున్నవారు పెద్ద సంఖ్యలో సత్యదేవుని ఆలయానికి తరలి వచ్చారు. వారంతా సత్యదేవుని వ్రతమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఇతర భక్తులు కూడా తోడవడంతో ఆలయంతో బాటు ఆలయ ప్రాంగణం, వ్రతాలాచరించే భక్తులతో వ్రత మంటపాలు, స్వామివారి దర్శనం అనంతరం సేద తీరే భక్తులతో విశ్రాంతి మంటపాలు కిక్కిరిసిపోయాయి. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించగా స్వామివారి వ్రతాలు మూడు వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మంది భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు.

కన్నుల పండువగా రథోత్సవం

సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి రథోత్సవం ఆది వారం కన్నుల పండువగా జరిగింది. ఉదయం పది గంటలకు రథాన్ని తూర్పు రాజగోపురం ముందుకు తీసుకువచ్చారు. అనంతరం ఆ రథంపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను ప్రతిష్ఠించారు. ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం దేవస్థానం ఏఈఓ కృష్ణారావు కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. తరువాత ఆలయ ప్రాకారంలో రథానికి నాలుగు దిక్కుల కొబ్బరి కాయలు కొట్టి రథోత్సవాన్ని నిర్వహించారు. రూ.2,500 టిక్కెట్‌తో ఇద్దరు భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేదపండితులు, అర్చకులు, వ్రతపురోహితులు పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సుప్రీం తీర్పును పునఃపరిశీలించాలి

- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకుల డిమాండ్
- మోరంపూడి జంక్షన్‌లో నిరసన, అర్ధనగ్న ప్రదర్శన



నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న పోరాట సమితి నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, సుప్రీంకోర్టు తీర్పు పునః పరిశీలించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు ఇసుకపట్ల రాంబాబు, తాళ్లూరి విజయకుమార్, నక్కా వెంకటరత్నం డిమాండ్ చేశారు. ఆదివారం మధ్యాహ్నం మోరంపూడి జంక్షన్‌లో ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ రూరల్ మండలం పరిధిలోని మోరంపూడి, హుకుంపేట, జైహింద్ నగర్, కోనేరుపేట, పిడింగొయ్యి మాల యువకులు నిరసన ర్యాలీ నిర్వహించి అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ముందుగా భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఇసుకపట్ల రాంబాబు తాళ్లూరి విజయ్‌కుమార్, నక్కా వెంకటరత్నం మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులను కాపాడుకోవలసిన బాధ్యతతో పాటు, ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకించి ప్రజా పోరాటం చేయవలసిన బాధ్యత ప్రతి మాల సోదరుడిపైన, ప్రతి అంబేడ్కర్ వాదిపై ఉందన్నారు. ఈ నెల 21న ప్రకటించిన భారత్ బంద్‌కు సంపూర్ణమద్దతు తెలుపుతున్నామన్నారు. నాయకులు సుందరపల్లి అనిల్,నక్కా విజయ్ కుమార్, 10వ డివిజన్ నాయకుడు ఆరే చిన్ని మాట్లాడారు. మండల నాయకులు చీరా రాజు, రత్నకుమార్ సిరంగి, మద్దెల రమణ, గెడ్డం ప్రభుదాస్, గెడ్డం ప్రసాద్, అల్లంపల్లి శ్రీనివాస్, మల్లవరపు అన్వేష్ పాల్గొన్నారు.

నిన్నటి క్లిక్.. రేపటి కిక్కు

- ప్రతి ఫొటో.. ఓ జ్ఞాపకం
- చరిత్రను సజీవంగా నిలిపే ఫొటోగ్రఫీ
- ఫొటోలు, సెల్ఫీలకు పెరుగుతున్న ప్రాధాన్యం
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం




ప్రతిబింబించిన ఫొటోగ్రాఫర్ పనితనం



ఉషోదయపు సోయగం



గ్రామీణ జీవన సౌందర్యం



సాగర సూర్యోదయం

రాజమహేంద్రవరం, రాయవరం: భావావేశాలకు గురిచేసే ఎన్నో సంఘటనలు.. ఆ ఘటనల దృశ్యాలు..వాటి జ్ఞాపకాలు మనసు పైపొరలో నిక్షిప్తమై ఆ అనుభూతులను ఆస్వాదించడమో.. లేదా అనుభవించడమో పూర్తి కాకముందే మరో సంఘటన.. దృశ్యం.. జ్ఞాపకం.. ఇలా జీవిత పర్యంతం ఎన్నో ఘటనల దృశ్యాలు మదిలో నిక్షిప్తమై కాలగతిలో కలసిపోతుంటాయి. వాటిలో కొన్ని ఘటనల దృశ్యాలు మాత్రం ఎప్పటికీ మదిని ముద్దాడేవో.. మెలిపెట్టేవో.. గిలిగింతలు పెట్టేవో కచ్చితంగా ఉంటాయి. వాటిని కళ్లముందు నిలిపే అద్భుతం 'చిత్రం' మాత్రమే. అనుకునో.. కావాలనో.. ఆదమరచినపుడో ఎవరో కెమెరాతో క్లిక్ మనిపించిన ఆ చిత్రం నిజంగా మాయావే. ఎన్నేళ్లు గతించిపోయినా ఏ మూలనుంచో.. ఏ ఆల్బం నుంచో బయటపడినపుడు గత కాలపు మధురోహల్లోకి తీసుకుపోయి మురిపించేస్తుంది. కన్నీరు పెట్టిస్తుంది. అవి ఆనంద బాష్పాలు కావచ్చు.. నిబ్బరం కోల్పోయి కార్చిన కన్నీరు కావచ్చు. కాలాన్ని సైతం జయించిన 'చిత్రం'.. ఎంతో అపురూపం.

మనసుతో తీస్తేనే ఫొటోగ్రాఫ్..

సాంకేతికంగా వృద్ధి చెందిన తరువాత వచ్చిన ఆవిష్కరణల్లో కెమేరా ఒక అద్భుతం. ఆ కెమెరా లెన్స్ ముందున్న దృశ్యాన్ని క్లిక్ మనిపిస్తే అది కేవలం ఫొటో అవుతుంది కానీ ఫొటోగ్రఫీ కాదు. ముందున్న దృశ్యాన్ని క్లిక్‌మనిపించే వ్యక్తి కన్ను భావగర్భితమైనదైనపుడే.. అటువంటి వ్యక్తి క్లిక్‌చేసి ఆవిష్కరించే చిత్రాన్నే ఆహా.. ఏం ఫొటోగ్రాఫ్ అనగలం. అలాంటి కెమెరా పితామహుడు డాగురేకు పేటెంట్ లభించిన రోజు ఆగస్టు 19న ఏటా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

ఫొటో విశ్వ వ్యాపితం..

అందుకే మిత్రులు, కుటుంబ సభ్యుల సమాగమం.. శుభాశుభ కార్యాలు.. సభలు, సమావేశాలు.. అది ఏదైనా నేడు ఫొటోలు తీయించడం సాధారణమైన విషయం. రేపటికి అదో జ్ఞాపకమే కాదు.. రిఫరెన్స్ కూడా. ఇక సాధారణ ప్రజా జీవనంలోకి వస్తే ప్రతి ఇంటా ఎన్నో బ్లాక్ అండ్ వైట్ ఫొటోలు.. రెండు లేదా మూడు దశాబ్దాల నాటి ఫొటోలు ఎన్నో ఉంటాయి. అవి చూసినపుడల్లా ఆ రోజుల్లోకి వెళ్లిపోయి నాటి డ్రెస్సింగ్, హెయిర్ స్టైల్ చూసుకుని ఎన్ని కామెంట్లు పాస్సైపోతాయో.. అన్నీ మనసును ఆ రోజుల్లోకి తీసుకెళ్లి గిలిగింతలు పెడతాయి.

గమ్మత్తైన చప్పుడు 'క్లిక్'

క్లిక్.. గమ్మత్తైన మెత్తని చప్పుడు. క్షణాల్లో సుందర దృశ్యం. చూపుడువేలి కొనతో బటన్ నొక్కితే ఎదుటి దృశ్యం చిన్ని చిప్‌లో బంధీ అవుతుంది. కొంతమందికి ఎన్ని సార్లు, ఎన్ని వేల ఫొటోలు తీయించుకున్నా కొత్తదనమే. గుండె కింద మెత్తని మధుర జ్ఞాపకాలను నిక్షిప్తం చేసి అవసరమైనప్పుడు వీక్షించగలిగే అపురూపమైన అవకాశాన్ని మనకు ఫొటోగ్రఫీ అందిస్తుంది.

ఇటీవల కాలంలో సెల్‌ఫోన్ల రాకతో కెమెరాల ప్రాభవం కాస్త తగ్గినా విలక్షణమైన ఫొటోలకు మాత్రం స్టూడియోలు, కెమెరాలను ఆశ్రయించక తప్పదు. రోలికార్డ్, రైస్ ల్యాండర్, రోలీ ఫ్లెక్స్, నికాన్, కేనన్ వంటి ఎన్నో కంపెనీల కెమెరాలు వివిధ మోడళ్లలో అందుబాటులోకి వచ్చాయి. వేల నుంచి లక్షల విలువ చేసే కెమెరాలు ప్రస్తుతం మార్కెట్లో లభ్యమవుతున్నాయి.

ఇంతింతై వటుడింతై అన్నట్లుగా

ఫొటోగ్రఫీ అనేది గ్రాఫోస్ అనే పదం నుంచి పుట్టింది. గ్రాఫోస్ అంటే రాయడం, చిత్రించడం అని అర్థం. మొదటిసారిగా 1826లో ఫ్రెంచి శాస్త్రవేత్త జోసఫ్ నైసిఫర్ నిప్సే కనిపెట్టిన మొదటి కెమెరాతో ప్రారంభమైన ఫొటోగ్రఫీ నేడు డిజిటల్ ఫొటోస్ స్థాయికి అభివృద్ధి చెందింది. తీసే ఫొటోను బట్టి దాని ప్రాముఖ్యాన్ని బట్టి నేడు వివిధ లెన్సులు అందుబాటులోకి వచ్చాయి. సెల్‌ఫోన్‌లో బ్యాక్, ఫ్రంట్ కెమెరాలు అందుబాటులోకి జనబాహుళ్యానికి ఫొటోగ్రఫీ మరింత దగ్గరైంది. తాజాగా డ్రోన్ ఫొటోగ్రఫీతో విహంగ వీక్షణం చేస్తూ తీసే ఫొటోలకు ఎంతో డిమాండ్ ఉంది.

వినూత్న రీతిలో..

నేచురల్, వైల్డ్ లైఫ్, ఫైన్ ఆర్ట్స్, నైట్ స్కేప్, వెడ్డింగ్ ఫొటోగ్రఫీ, యాష్రో ఫొటోగ్రఫీ, స్ట్రీట్ ఫొటోగ్రఫీ, సీటీస్కేప్స్, ల్యాండ్ స్కేప్స్, నైట్‌స్కేప్స్ ఇలా ఎన్నో రకాలుగా ఫొటోగ్రాఫర్లు తమ ప్రతిభ చాటుకుంటున్నారు. ఎమోషన్లు, ఫీలింగ్స్, సేడ్‌నెస్, థింకింగ్, కేరింగ్ ఇలా అన్ని రకాల ఎమోషన్లను ఒక్క క్లిక్‌తో చూపిస్తుంటారు. అంతే కాకుండా సమాజంలో జరుగుతున్న ఆకృత్యాలను కళ్లకు కట్టినట్టు చూపించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే ఫోటోలు తీయడంలోను కొందరకు తమ ప్రతిభ చూపుతున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ

కాకినాడలో చెక్కా బసవరాజు 1885లో ఓ హాబీగా ఫొటోగ్రఫీని ప్రారంభించి చెక్కా బసవరాజు అండ్ సన్స్ ఏర్పాటు చేశారు. నాలుగు తరాలుగా తన కుటుంబం ఆ ప్రతిష్ఠను నిలబెట్టుకుంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఫొటోగ్రఫీ అసోసియేషన్లలో నాలుగు వేల మంది వరకు ఫొటోగ్రాఫర్లు ఉన్నారు. ఫొటోగ్రాఫర్లలో మిక్సింగ్ ఎడిటర్లు, ఫొటోగ్రఫీ ఎడిటర్లు, ఫొటోల్యాబ్ ఆపరేటర్లు ఇలా.. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు ఏడు వేల మంది ఈ వృత్తిపై ఆధారపడి ఉన్నారు. కాకినాడ జిల్లాలో 15 మండలాలకు చెందిన సుమారు 2వేల మంది ఫొటోగ్రాఫర్లు 4 జోన్లు, 8 సంఘాలుగా ఉన్నారు.

కుటుంబం అంతా కలసికట్టుగా..

కపిలేశ్వరపురం మండలంలోని అంగర గ్రామానికి చెందిన పద్మాలయా ఫొటో స్టూడియోను 1986 ఆగస్టు 16న ప్రారంభించారు. వారి కుటుంబం ఫొటో గ్రాఫర్ల జీవన విధానాన్ని స్పష్టం చేస్తుంది. గ్రామానికి చెందిన సోదరులు చిక్కం నరసింహారావు, శ్రీనివాస్, కాశీ విశ్వనాథం 38 ఏళ్లుగా స్టూడియో నిర్వహిస్తున్నారు. ఆహ్లాదకరమైన ప్రకృతి అందాలను కెమేరాతో ఒడిసి పట్టడం శ్రీనివాస్‌కు అలవాటు.

ఒక్క ఫోటో కోసం రోజుల తరబడి..



కొన్నిసార్లు ఒక్క ఫొటో కోసం గంటలు, రోజులు వేచి చూడాల్సి వస్తుంది. పర్యావరణం, గిరిజన జీవన విధానాలపై పలు చిత్రాలు తీశాను. కొన్ని చిత్రాలకు అవార్డులు కూడా వచ్చాయి.

– మిరియాల సురేష్, ఫొటోగ్రాఫర్, పిఠాపురం

ట్రెండ్‌కు తగ్గట్టు మార్పులు



నిత్యం ట్రెండ్ మారిపోతూ ఉంటుంది. దానికి తగ్గట్టు తాము మారాలి. అది ఖర్చుతో కూడుకున్నది. సెల్‌ఫోన్లలోనూ మంచి నాణ్యమైన కెమెరాలు ఉండడంతో ప్రతి ఒక్కరూ ఫొటోగ్రాఫర్లుగా మారిపోతున్నారు. ప్రొఫెషనల్ ఫొటో గ్రాఫర్స్ మాత్రం తక్కువగానే ఉంటారు.

– సాగర్, డిజిటల్ ఫొటో, వీడియోగ్రాఫర్, ఉప్పాడ

క్లుప్తంగా

రూ.4 లక్షల ఖరీదైన బైక్ చోరీ



చోరీకి గురైన బైక్ (ఫైల్)

పెద్దాపురం: స్థానిక బ్యాంక్ కాలనీలో సుమారు రూ.నాలుగు లక్షల విలువైన బైక్ చోరీకి గురైనట్లు ఆదివారం ఫిర్యాదు అందింది. స్థానిక ఎస్సై మౌనిక తెలిపిన వివరాల మేరకు స్థానిక నియర్స్ కింగ్ ఓపెరా అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న ఆర్‌అండ్‌బి డీఈ ఎం.నాగేశ్వరరావుకు చెందిన ఏపీ39 క్యూజే 3838 నెంబరు గల బైక్ యథావిధిగానే పార్క్ చేసి ఉంచారు. ఆదివారం ఉదయం లేచి చూసేసరికి బైక్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బహ్రెయిన్‌లో పెదపట్నంలంక యువకుడి ఆత్మహత్య



నాగసాయి (ఫైల్)

మామిడికుదురు: ఉపాధి కోసం బహ్రెయిన్ వెళ్లిన పెదపట్నంలంక యువకుడు ఉరి వేసుకుని చనిపోయాడని కుటుంబ సభ్యులకు శనివారం రాత్రి సమాచారం రావడంతో వారు కన్నీరు మున్నీరవుతున్నారు. వివరాల్లోకి వెళితే మామిడికుదురు మండలం పెదపట్నంలంక శివారు దుర్గాపట్నానికి చెందిన నాగులాపల్లి వీర వెంకటదుర్గా నాగసాయి (22) బహ్రెయిన్‌లో శనివారం ఉరి వేసుకుని చనిపోయాడు. గత నెల 22న ఇంటి నుంచి వెళ్లిన నాగసాయి 29న బెహ్రెయిన్ చేరుకున్నాడని అతని మేనమామ ఉండపల్లి రమేష్ అలియాస్ శ్రీను ఆదివారం తెలిపారు. అక్కడ పెట్రోల్ బంకులో పని చేస్తున్నాడని, అక్కడి సమస్యలపై ఎప్పుడూ చెప్పలేదని, చనిపోవడానికి రెండు రోజులు ముందు కూడా ఫోన్లో మాట్లాడాడని ఆయన తెలిపారు. నాగసాయి మృతిపై విచారణ జరిపించాలని, అతని మృతదేహాన్ని స్వదేశం రప్పించేందుకు సహకరించాలని ఎంపీ గంటి హరీష్ మాధుర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను కోరారు. ఇండియన్ ఎంబసీ అధికారులతో కూడా ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నామని మేనమామ తెలిపారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి

కొత్తపల్లి: ప్రమాదశాత్తు చెరువులోపడి ఒక వ్యక్తి మృతి చెందినట్టు పోలీసులు ఆదివారం తెలిపారు. మండలంలోని కొమరగిరి శివారు చిన్న కలవలదొడ్డికి చెందిన దొంగల శ్రీను(48) అదే గ్రామంలో ఉన్న కథారి చంటిబాబు పొలంలో ఉన్న చెరువులోకి గేదెను కడిగేందుకు దిగాడు. ప్రమాదశాత్తు అదుపుతప్పి చెరువులో పడి మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్సై వెంకటేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విశ్వజన మోహితం సంస్కృతం

- ప్రపంచంలో 877 భాషలపై ఎంతో ప్రభావం
- భారత సంస్కృతి, సంస్కృతం ప్రతిష్టమైనవి
- నేడు విశ్వ సంస్కృత భాషా దినోత్సవం
- సంస్కృత భాషపై అభిమానంతో నేడు ఉజుపిస్ దేశం స్టాంప్ విడుదల

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): భాషలకు సంస్కృతం తల్లివంటిది అని తొలి తెలుగు వ్యాకరణకర్త, ఆంధ్రభాషాభూషణము రచయత మూలఘటిక కేతన అన్నట్లుగా ప్రపంచం అంతా ఇప్పుడు సంస్కృతం గురించి గొప్పగా చెప్పుకుంటోంది. కాని భారతదేశంలో పుట్టిన సంస్కృతం ఒక్క వర్గం వారికి తప్ప మరే ఇతర వర్గాల వారు అభ్యసించకపోవడంతో ఆ భాష నేడు కనుమరుగవుతోంది. పాశ్చాత్య దేశాల వారు ఈ భాష ఔన్నత్యాన్ని గుర్తించి నేర్చుకోవడం హర్షణీయం. నిజానికి సంస్కృతం అంటే భాష కాదు. కృతము అంటే చెయటము లేదా చేసినదని, సంస్కరిపబడిన పని, భాష అని అర్థము.

జనని ఎల్ల భాషలకు సంస్కృతంబు అనడానికి కారణమిదే. ప్రపంచంలో అతి పురాతన భాషల్లో సంస్కృతం ఒకటి. మన దేశ అధికారిక భాషగా గుర్తించబడి గౌరవించబడుతోంది. సంస్కృతాన్ని దేవ భాష, అమరవాణి, గీర్వాణిగా పిలుస్తారు. సంస్కృతం దేశ భాషలపైనే కాదు, ప్రపంచంలోని 877 భాషలపై తన ప్రభావాన్ని కలిగి ఉందని పరిశోధనలు తేల్చారంటే ఆ భాష ప్రభావం అర్థం చేసుకోవచ్చు. సంస్కృతం ఔన్నత్యాన్ని నిలబెట్టేలా ఏటా శ్రావణ పౌర్ణమి రోజున విశ్వ సంస్కృత భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

సంస్కృత భాష గొప్పదనం

సంస్కృతాన్ని ఉన్నతమైనదిగా గుర్తించారు కాబట్టే ఈ భాషలోని గ్రంథాలను వివిధ భాషల్లోకి పాశ్చాత్య పండితులు అనువదించుకున్నారు. అలాగే ఆధునిక విజ్ఞాన విషయాలకు సంస్కృత సాహిత్యం భాండాగారం. ఇవే మన ప్రస్తుత సంస్కృతికి నిలువుటద్దాలై మనల్ని ముందుకు నడిపిస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు. పంచతంత్రం, హితోపదేశం, ఇతిహాసాలు రామాయణ, భారతం, భర్తృహరి సుభాషితాలు ప్రపంచ సాహిత్యానికి అద్భుతమైన ఎన్సైక్లోపీడియాలు.

సంస్కృతంపై ఉజుపిస్ దేశం స్టాంప్ విడుదల..

మన సంస్కృతానికి మనం గౌరవం ఇవ్వకపోయినా పాశ్చాత్య దేశాల వారు ఎంతో గౌరవం ఇస్తున్నారు. ఏకంగా రిపబ్లిక్ ఆఫ్ ఉజుపిస్ దేశం వారు ప్రపంచ సంస్కృత దినోత్సవం సందర్భంగా లిథునియా రాజధాని ఇండియన్ ఎంబసీలో సోమవారం గౌరవ సూచకంగా కమెరెటివ్ స్టాంపును విడుదల చేస్తోంది. అసలు యూరోపియన్ దేశమైన ఉజుపిస్ సంస్కృత పై ఇంత గౌరవాన్ని ఉంచి స్టాంపును ఎందుకు విడుదల చేస్తోందన్న అనుమానం రావటం సహజం. ఉజుపిస్ అధికారిక భాష లిథునియా. ఈ భాష సంస్కృతానికి చాల దగ్గరగా ఉంటుంది.

పేరుకే యూరోపియన్ భాష లిథునియా కాని అనుసరించేది పూర్తిగా సంస్కృతమే. అతిపురాతమైన విల్నియస్ యూనివర్సిటీలో ఏషియన్ ట్రాన్సిడెంటల్ స్టడీస్ కేంద్రంలో సంస్కృత శాఖ ఉంది. ఈ కేంద్రంలో పనిచేసే ఆచార్య వితస్ బిధునస్ 2016లో సంస్కృత లిథునియామాల అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఇందులో సంస్కృతానికి లిథునియాకి వున్న సంబంధం గురించి వివరించారు.



నేడు విడుదల కానున్న స్టాంప్ కవర్

కంప్యూటర్‌కు వాడుకోగలిగే భాషల్లో మొదటి స్థానం సంస్కృతానిదే.

ఆ భాష అతి గొప్ప లక్షణం ఎన్ని వేల లక్షల కొత్త పదాలనైనా తయారు చేయవచ్చు. వాటికి వ్యుత్పత్తి కలిగి ఉండడం మరో ప్రత్యేకత. అందుకనే లిథునియా, రష్యా, స్లావేకియా మొదలైన యూరోపియన్ దేశాల వారు వారి మూలాలను సంస్కృతంలో వెతుక్కుంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రెండు రకాల స్టాంపులను ఉజుపిస్ విడుదల చేస్తోంది. వాటి ధర ఇండియన్ కరెన్సీలో రూ.ఒక్కొటి రూ.120 ఉంటుంది.

సంస్కృతంతో విడదీయరాని బంధం



సంస్కృతంతో తెలుగుకు విడదీయరాని సంబంధం ఉంది. తెలుగులో 40 శాతం పదాలు సంస్కృతం నుంచే వచ్చాయని భాషా శాస్త్రవేత్తల అభిప్రాయం. తెలుగు, సంస్కృతం రెండు ఒకే భాషా కుటుంబానికి చెందకపోయినా ఒకటితో ఒకటి కలిసి మనగలగడం ఆశ్చర్యం.

– డాక్టర్ పీవీబీ సంజీవరావు,
తెలుగు శాఖధిపతి, ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

స్టాంప్ విడుదల



సంస్కృతం భారతీయ భాషలలో అంతర్లీనంగా ఉంటుంది. కొన్ని పదాలు అటూఇటూ రూపాంతరం చెందాయి. రూపాంతర భాషాకుటుంబాలకి ప్రాకృతభాషలని పేరు. సంస్కృతంపై ఉజుపిస్ దేశం స్టాంప్ విడుదల చేయడం ఆనందంగా ఉంది. నేడు నన్నయ యూనివర్శిటీ, కలెక్టరేట్‌లో ఈ స్టాంప్‌ని విడుదల చేయనున్నారు.

– శ్రీనివాస చీమలమర్రి,
అంబాసిడర్ ఫర్ జైన్ లిటరేచర్, రిపబ్లిక్ ఆఫ్ ఉజుపిస్

వందే సంస్కృత భారతీమ్



భాషాసు ముఖ్య మధుర
దివ్య గీర్వాణ భారతి !
తస్మాది కావ్యం మధురం
తస్మాదపి సుభాషితం!
పద్మాసన ప్రియాం దేవీం
వీణా పుస్తక ధారిణీం!
జననీం సర్వవిద్యానాం

ప్రపంచంలో ఉన్న వేల భాషలలో సంస్కృతం ప్రాచీనమైనది. సాహిత్య పరంగా, సౌందర్యపరంగా, వాంగ్మయ వైశాల్యపరంగా, శబ్ద సంపదగా ఏ దృష్టితో చూసినా దీనిని మించిన భాష మరొకటి లేదు. భారతీయులు దీనిని చూసి గర్వించాలి. సరళంగా స్పష్టంగా నేర్చుకోదగిన భాష సంస్కృతం. అభ్యసించేలా కృషి చేద్దాం! రాబోయే తరాలకు అలవాటు చేద్దాం.

– రాజనాల రాజేశ్వరి, సంస్కృతశాఖ, శ్రీమతి
కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాల

వంద కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరు నిందితుల అరెస్టు
- డీఎస్పీ శ్రీనివాసులు



స్వాధీనం చేసుకున్న వంద కిలోల గంజాయి బస్తాలతో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ వీరయ్యగౌడ్, ఎస్సై మనోహర్

రాజానగరం: జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న వంద కిలోల గంజాయిని స్థానిక పోలీసులు ఆదివారం పట్టుకుని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ గంజాయి విలువ సుమారు రూ.5 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఉత్తర మండల డీఎస్పీ కె.శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు

రాజానగరంలోని మాధవీ ఫంక్షన్ హాలు వద్ద జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న టిఎన్ 88 బి 5961 నంబరు గల లారీలో తరలిస్తున్న వంద కిలోల గంజాయి పట్టుబడింది. తమిళనాడులోని సేలం జిల్లా వజపడి మండలం, వెప్పిలైపట్టిపుదుర్‌కు చెందిన లారీ డ్రైవర్ కమ్ ఓనర్ అయిన మరిముత్తు ఆర్ముగమ్ (45), పెరంబలూరు జిల్లా, సిరుమతూర్ మండలం, కుదిక్కడుకు చెందిన వేల్ మురుగన్ (27) పశ్చిమ బెంగాల్ కిరాయికి వెళ్లి తిరిగి వస్తూ విశాఖపట్నం సమీపంలోని ఏజెన్సీ ప్రాంతం నుంచి ఈ గంజాయిని తక్కువ రేటుకు కొనుగోలు చేశారు. అక్కడ నుంచి ఆ గంజాయిని ఐదు సంచులలో నింపి తీసుకువెళ్లి, చిల్లర వ్యాపారం చేస్తున్నారన్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, గంజాయిని, లారీని, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ కేసులో చురుగ్గా పనిచేసిన సీఐ, ఎస్సైలను ఎస్పీ నరసింహ కిశోర్ అభినందించినట్టు డీఎస్పీ తెలిపారు.

ఏడాదిలో ఏడు కేసులు..

స్థానిక పోలీసు స్టేషను పరిధిలో ఈ ఏడాదిలో గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి ఇంతవరకు ఏడు కేసులు నమోదయ్యాయని ఉత్తర మండల డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. వీటిలో సుమారు రూ.25 లక్షలు విలువ చేసే 506.35 కిలోల గంజాయితో పాటు రవాణాకు ఉపయోగించిన రెండు లారీలు, ఒక వ్యాన్, ఒక మోటారు సైకిలును స్వాధీనం చేసుకుని, 22 మందిని అరెస్టు చేశామన్నారు. సమావేశంలో సీఐ ఎస్పీ వీరయ్యగౌడ్, ఎస్సై మనోహర్ పాల్గొన్నారు.

కోడిపందేలు ఆడుతున్న ముగ్గురి అరెస్టు

సీతానగరం: మండలంలోని ఇనుగంటివారిపేట శివారున కోడిపందాలు ఆడుతున్న ముగ్గురుని అరెస్ట్ చేశామని ఎస్సై ఎ.ఫణి మోహన్ ఆదివారం తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి మునికూడలి, బొబ్బిల్లంక, కాటవరాలకు చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కోళ్లు, రెండు కోడి కత్తెలు, రూ.11,400 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని ఎస్సై ఫణి మోహన్ తెలిపారు.

అమెరికాలో ఇంటర్న్‌షిప్‌నకు అమలాపురం కుర్రాడు



అమెరికాకు ఎంపికైన అమలాపురం యువకుడు చంద్రబాబును సత్కరించి అభినందిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన పిల్లాడి మధుకృష్ణ చంద్రబాబు సినీ నటుడు సోనూసూద్ అందించిన సాయంతో చదువుకుని ప్రయోజకుడై అమెరికాలో ఇన్‌టర్న్‌షిప్‌కు ఎంపికయ్యాడు. స్థానిక చిరు వ్యాపారి కుమారుడైన అతడు సోనూ అందించిన రూ.10 లక్షల సాయంతో పంజాబ్‌లోని లూధియానాలోని సిటీ యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీలో డిగ్రీ చేస్తూ ఈ ఘనత సాధించాడు. జే-వన్ వీసాపై ఆ యువకుడిని హాస్పటాలిటీ స్టూడెంట్ - ఎక్ఛేంజ్ విజిటర్‌గా 12 నెలల పాటు అమెరికా వెళ్లనున్నాడు. కరోనా కాలంలో రవాణా స్తంభించిన పడు స్థానిక ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, సామాజిక కార్యకర్త బాబీ గాబ్రియేల్ సాయంతో తన చదువు కోసం లూధియానా వర్సిటీకి వెళ్లినట్టు గుర్తుచేసుకున్నాడు. ఈ సందర్భంగా వారు చంద్రబాబును అభినందించారు.

ఆహో.. ఏమి రుచి!

తాటి పండు..గ్రామీణ ప్రజలకు దీనిని పరిచయం చేయనక్కర్లేదు. ప్రస్తుత సీజన్‌లోనే ఇది లభిస్తుంది. నేటి ఆధునిక సమాజంలో సీజనల్ పండ్లను వినియోగించడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతుండటంతో ప్రజలు తాటి పండ్లను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. దీంతో వాటి అమ్మకాలు రెండేళ్లుగా ఎక్కువయ్యాయి. గతేడాది ఒక తాటి పండు ధర రూ.15 పలుకగా.. దీనికి డిమాండ్ ఎక్కువగా పలుకుతుండటంతో ఇప్పుడు ఒక్క తాటి పండు ధర మార్కెట్‌లో రూ.30 నుంచి రూ.40 వరకు పలుకుతోంది. - మలికిపురం



నోరూరించే తాటి గారెలు

- తాటి పండుకు రోజురోజుకూ పెరుగుతున్న గిరాకీ
- గతేడాది రూ.15కే పండు.. ప్రస్తుతం రూ.30 నుంచి రూ.40కి పెరుగుదల
- పోషకాల గని కావడంతో పెరిగిన వినియోగం

మధుమేహ నియంత్రణలో మేటి

చాలా పోషకాలు ఉండే ఈ తాటి పండు తింటే ఆరోగ్యానికి మంచిదని వైద్య నిపుణులు చెబుతుంటారు. తాటి పండు నుంచి గుజ్జును తీస్తున్న కొద్దీ వస్తూనే ఉంటుంది. ఇది తినడం వల్ల పిల్లల ఎదుగుదల చాలా బాగుంటుంది. కొంతమంది ఈ తాటి పండును నిప్పులపై కాల్చి నేరుగా చప్పరిస్తూ ఉంటారు. కొంతమంది స్పూన్ తో లేదా దానిని తురుముకొని తాటి గుజ్జును తీసుకుని తింటారు. ఈ గుజ్జుతో తాండ్రను కూడా తయారు చేస్తూ ఉంటారు. ఈ తాటి తాండ్ర సంవత్సరమంతా నిల్వ ఉంటుంది. తాటి తాండ్రను తినడం వల్ల షుగర్ వ్యాధి నియంత్రణలో ఉంటుందని, టైప్-2 డయాబెటిస్‌తో బాధపడేవారు దీనిని తింటే మంచి ఫలితాలను పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పూర్వకాలంలో అయితే బెల్లానికి బదులుగా తాటి పండు గుజ్జునే ఎక్కువగా ఉపయోగించేవారు. ఇది వ్యాధి నిరోధక శక్తిని బాగా పెంపొందిస్తుంది. అప్పట్లో దీనితో కుడుములు కూడా వండుకుని తినేవారు. తాటి పండును తింటే శరీరానికి కావాల్సిన శక్తి, బలం అందుతుంది. నేటి కాలంలో కొందరు ఈ గుజ్జుతో స్వీట్‌లను, కేక్ లను కూడా తయారు చేస్తున్నారు. దీనిలో ఉండే క్యాల్షియం ఎముకలను ధృడంగా, బలంగా ఉంచుతుంది. ఈ పండును ఆహారంగా తీసుకోవడం వల్ల జీర్ణశక్తి కూడా మెరుగుపడుతుంది. మలబద్ధకం సమస్య కూడా తగ్గు ముఖం పడుతుంది.



తాటి రొట్టెలు

రుచి.. మైమరచి

ఈ తాటిపళ్ళు ఎన్నో అద్భుతమైన మన పల్లెటూరు రుచులను అందిస్తాయి. వీటితో రొట్టెలు, ఇడ్లీలు, గారెలు, మంగా కుడుములు (తాటి ఆకులలో పెట్టి ఆవిరితో వండుతారు) లాంటివి చేసుకుంటారు. అన్నిటికన్నా ముఖ్యమైనది తాటి రొట్టె. లొట్టలు వేయించే రుచి దీని సొంతం. తాటి పండ్లను పూర్తిగా శుభ్రం చేసి దాని గుజ్జు తీశాక సరిపడా వరి నూక, బెల్లం, కొబ్బరి తురుము, యాలకుల పొడి కలిపి నాలుగైదు గంటలు నాన బెట్టుకుని, చిన్న మంటపై మూకుడులో రొట్టెల్లా వేసి కింద నుంచి కాసింత సెగ తగిలిస్తారు. పైన ఒక అరిటాకును బోర్లించి కింద పొయ్యిలో ఉన్న నిప్పుల్ని అరిటాకు మీద వేసి కొంత సమయం అయ్యాక ఆ నిప్పులను తీసివేస్తే దిబ్బరొట్టె రెడీ అవుతుంది. ఇది తింటే ఆ రుచే వేరు. తాటి గారెలు కూడా అంతే.. ఈ తాటి పండ్ల వంటకాలను సైతం ఊళ్లలోని ప్రధాన కూడళ్ళలో విక్రయాలు కూడా సాగిస్తున్నారంటే వీటికి ఉన్న ఆదరణ అర్థం అవుతుంది.



తాటి కాయలు అమ్ముతున్న వ్యాపారి



తాటి గుజ్జును తీస్తున్న దృశ్యం

మద్యం దుకాణం వాచ్‌మన్‌పై హత్యాయత్నం

- పోలీసుల అదుపులో నిందితుడు
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు



కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు ఖండవల్లి జయరాజు

కొవ్వూరు: పట్టణంలో బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద నైట్ వాచ్‌మన్‌గా పని చేస్తున్న ఖండవల్లి జయరాజుపై ఆదివారం తెల్లవారు జామున హత్యాయత్నం జరిగింది. మెరకవీధికి చెందిన పిండి సుబ్రహ్మణ్యం తెల్లవారు జామున నాలుగు గంటలకు దుకాణం వద్దకు వచ్చి మద్యం కావాలని అడిగారు. దుకాణం మూసేశారని, మద్యం లేదని చెప్పడంతో ఆగ్రహించిన సుబ్రహ్మణ్యం తనతో తెచ్చుకున్న చాకుతో దాడి చేసి జయరాజు ముఖం, తల, చేతులపైన, చెవి వెనుక, ఛాతీ పైన గాయపరిచారు. జయరాజు కింద పడిపోవడంతో చనిపోయాడనుకుని సుబ్రహ్మణ్యం పారిపోయినట్లు పోలీసులు చెబుతున్నారు. చాకుకు ఉన్న పిడి విరిగిపోవడంతో బాధితుడికి ప్రాణాపాయం తప్పింది. తీవ్ర రక్తస్రావంతో పడి ఉన్న జయరాజును స్థానికులు స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. నిజానికి మానసిక వికలాంగురాలైన సుబ్రహ్మణ్యం సోదరి పట్ల జయరాజు గతంలో అసభ్యకరంగా ప్రవర్తించారని, ఆ కోపంతోనే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలిందని ఎస్సై కె.జగన్ మోహన్‌రావు తెలిపారు. ఈ విషయంపై సుబ్రహ్మణ్యం సోదరుడు గతంలో జయరాజును మందలించాడని వివరించారు.సెంట్రింగ్ పనులు చేసుకునే సుబ్రహ్మణ్యం తరచూ బయటి ప్రాంతాలకు వెళ్లి వస్తుంటాడని, వీరి ఇంటి పక్కనే సుబ్రహ్మణ్యం సోదరుడు నివసిస్తుంటే, వదిన వీరికి వండి పెడుతుండేదన్నారు. సోదరి పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్టు తెలుసుకుని జయరాజుపై కక్షతో ఈ హత్యాయత్నానికి పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడు సుబ్రహ్మణ్యాన్ని అదుపులోకి తీసుకున్నామని, డీఎస్పీ జి.దేవకుమార్ ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాజమహేంద్రవరంలో కిడ్నీ సెంటర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్



డాక్టర్ గౌతమ్‌ను అభినందిస్తున్న రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి, జీఎస్ఎల్ హాస్పిటల్ చైర్మన్ భాస్కరరావు వైఎస్సార్ సీపీ పార్లమెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ తదితరులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలో డాక్టర్ గౌతమి రెడ్డి గౌతమ్ యూరాలజీ అండ్ కిడ్నీ సెంటర్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా విజయ భారతి చెస్ట్ ఇనిస్టిట్యూట్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత, ప్రఖ్యాత వైద్య నిపుణులు, వైఎస్సార్ సీపీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ హాజరై ఇన్ పేషెంట్ రూమ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో గౌతమ్ యూరాలజీ అండ్ కిడ్నీ సెంటర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత, అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, ప్రఖ్యాత వైద్యులు జీఎస్ఎల్ వైద్య సంస్థల అధినేత డాక్టర్ గన్ని భాస్కర్‌రావు, డాక్టర్ వీర్రాజు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు రాజమహేంద్రవరంలో ఈ ఆస్పత్రిని అందుబాటులోకి రావడంపై అభినందనలు తెలిపారు.